క్లుప్తంగా

చెట్టుపల్లి శివాజీపై దాడిని ఖండిస్తున్నాం



మాట్లాడుతున్న సోమిడి శ్రీనివాస్

నయీంనగర్: ఆరె సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీపై గుర్తుతెలియని వ్యక్తులు మార్చి 28న దాడి చేయడాన్ని తెలంగాణ రైతు సంఘం ఖండిస్తున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సోమిడి శ్రీనివాస్, జెండా అంబయ్య మాట్లాడుతూ దాడి చేసిన వ్యక్తులను చట్టపరంగా శిక్షించాలని కోరారు. ఈ సమావేశంలో సిరుల రవీందర్, జెండా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



అభినందిస్తున్న హెచ్ఎం, కరస్పాండెంట్

ఖిలా వరంగల్: విద్యార్థులు ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని న్యూ కౌటిల్యాస్ స్కూల్ కరస్పాండెంట్ కోడం శ్రీధర్ సూచించారు. వరంగల్ కరీమాబాద్ రోడ్డులోని న్యూ కౌటిల్యాస్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు కోడం సవిత ఆధ్వర్యంలో గురువారం సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై వైజ్ఞానిక, సైన్స్‌ఫెయిర్ ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం, విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన పలు రకాల ఎగ్జిబిట్లను తిలకించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు న్యాయం జరగాలి



మాట్లాడుతున్న భరత్

దేశాయిపేట: టీఎస్‌పీఎస్సీ తప్పిదం వల్ల అన్యాయం జరిగిన నిరుద్యోగులకు న్యాయం చేయాలని బీఎస్పీ వరంగల్ తూర్పు అధ్యక్షుడు జన్ను భరత్ డిమాండ్ చేశారు. దేశాయిపేటలోని సీకేఎం కళాశాల ఎదుట లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్కామ్ వెనుక ఉన్న పెద్దలను బయటకు తీసుకువచ్చేందుకు సీబీఐతో విచారణ జరిపించాలని సూచించారు. ఇలాంటి మోసం జరగకుండా ఇప్పుడున్న టీఎస్‌పీఎస్సీ కమిటీని తొలగించి కొత్త వారిని నియమించాలన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులకు బీఎస్పీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, శ్రీకాంత్, రాజేష్, లోకేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


మహా అన్నదానం



అన్నదానం చేస్తున్న మొగిలిచెర్ల దినేష్

వరంగల్ చౌరస్తా: శ్రీరామ నవమిని పురస్కరించుకొని వరంగల్ 28వ డివిజన్ గిర్మాజీపేట రాధిక థియేటర్ సమీపంలో సినీ హీరో నాని అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొగిలిచెర్ల దినేష్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జితేందర్, శ్రీకాంత్, గొలనకొండ అభి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌నగర్‌లో..



వరంగల్: నగరంలోని 3, 12, 14 డివిజన్ల పరిధిలోని ఆరెపల్లి, పైడిపల్లి, డాక్టర్స్‌కాలనీ, గాంధీనగర్, స్నేహనగర్, వెంకటేశ్వరకాలనీ, ఎస్ఆర్‌నగర్, ఎన్‌టీఆర్‌నగర్‌లలో శ్రీరామనవమి వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. ఎస్ఆర్‌నగర్‌లో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అరూరి రమేష్, 3వ డివిజన్ కార్పొరేటర్ జన్ను షీబారాణి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం

మెట్టుగుట్టపై సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



హనుమకొండ టీచర్స్ కాలనీ-1లో జరిగిన కల్యాణోత్సవానికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి



విశ్వనాథకాలనీలో సీతారామచంద్రస్వామి కల్యాణానికి హాజరైన మేయర్ గుండు సుధారాణి, తదితరులు



శ్రీరామనవమిని పురస్కరించుకుని నగరవ్యాప్తంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని గురువారం కనుల పండువగా నిర్వహించారు. నిర్వాహకులు ప్రత్యేక వివాహ మండపాలు ఏర్పాటు చేయగా, పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య రాములోరి కల్యాణం వైభవంగా జరిగింది. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

\- సాక్షి నెట్‌వర్క్



హసన్‌పర్తి: తలంబ్రాలు సమర్పిస్తున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్



54వ డివిజన్‌లో పాల్గొన్న డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కార్పొరేటర్లు



స్నేహనగర్‌లో ప్రసన్నాంజనేయ దేవాలయంలో దాస్యం విజయ్‌భాస్కర్, కాలనీ వాసులు



గాంధీనగర్‌లో 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి దంపతులకు జ్ఞాపిక అందజేస్తూ..



ఆర్టీసీ వరంగల్ -1 డిపోలో కల్యాణంలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది



వడ్డెపల్లిలో 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్‌భాస్కర్, కుటుంబ సభ్యులు



బొమ్మలగుడిలో సీతారామచంద్రస్వామి కల్యాణం



కాజీపేట రైల్వే రామాలయంలో కల్యాణ వేడుకలు



కాజీపేట జుబ్లీమార్కెట్‌లో తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు శ్రీనివాస్‌శర్మ



హనుమకొండ చౌరస్తాలోని శివశక్తి స్థల్‌లో వేడుకలకు హాజరైన భక్తులు



కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులో సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో..



ఆరెపల్లిలో రాములోరి కల్యాణంలో తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు



రామన్నపేటలోని వేంకటేశ్వర ఆలయంలో..



హనుమకొండ చౌరస్తాలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం



కాశిబుగ్గ రంగనాథస్వామి ఆలయంలో కల్యాణ వేడుకల్లో హారతి చూపిస్తున్న అర్చకుడు



మడికొండ వాల్మీకి ఆలయంలో వేడుకల్లో పాల్గొన్న వాల్మీకి కుల సంఘం పెద్దలు



53వ డివిజన్‌లో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న కార్పొరేటర్ సోదా కిరణ్



హనుమకొండ రెవెన్యూ కాలనీలో..



హనుమకొండలోని సాయిబాబా గుడిలో..

భద్రకాళి దేవాలయంలో సీతారాముల కల్యాణం



తాళిబొట్టు చూపిస్తున్న నరసింహమూర్తి

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న వసంత నవరాత్ర ఉత్సవాలు గురువారం ముగిశాయి. శ్రీరామనవమిని పురస్కరించుకుని గురువారం రాత్రి 7గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అమ్మవారికి నిత్యాహ్నికం, శ్రీరామ జన్మదినోత్సవం, తారాజయంతిని పురస్కరించుకుని వృద్ధిహోమం, మహా పూర్ణాహుతి చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ ఈఓ శేషుభారతి పర్యవేక్షించారు.

మజ్జిగ పంపిణీ చేసిన ముస్లింలు



మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న నార్లగిరి రమేష్

కాజీపేట: కాజీపేట అభయాంజనేయస్వామి దేవాలయం ఆవరణలో సీతారామ కల్యాణ మహోత్సవ వేడుకలను పురస్కరించుకుని భక్తులకు పీసు కమిటీ సభ్యులు (ముస్లింలు) గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు నార్లగిరి రమేష్ ప్రారంభించారు. పీస్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ సర్వర్ ఆధ్వర్యంలో సుమారు 2వేల మంది భక్తులకు మజ్జిగ అందించారు. ఈ సందర్భంగా రమేష్‌ను మాట్లాడుతూ హిందువుల పండుగలకు ముస్లింలు ముందుకు వచ్చి భక్తులకు ప్రతి ఏటా మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జి.రమణారెడ్డి, నల్లెల సోమేశ్వర్ రావు, కోండ్ర శంకర్, పాలడుగుల మనోహర్ పాల్గొన్నారు.

గోవిందరాజస్వామి తిరుకల్యాణం



పురవీధుల్లో ఊరేగిస్తున్న అర్చకులు, స్థానికులు

వరంగల్ చౌరస్తా: వరంగల్ నగరంలో గోవిందరాజస్వామి కల్యాణ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, స్వామివార్లకు ఈఓ రత్నకర్ రెడ్డి, అర్చకులు వరయోగుల శ్రీనివాసస్వామి పట్టు వస్త్రాలు సమర్పించారు. పూజా కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, స్థానికులు సునీల్, అర్చకులు పాల్గొన్నారు. అనంతరం స్వామిని ఆలయ పురవీధుల్లో ఊరేగించారు.

డీసీసీకి అధ్యక్షుడు కావలెను..

వరంగల్ జిల్లా కాంగ్రెస్‌కు నాయకుడు లేక పార్టీలో స్తబ్దత

- ముఖ్య నేతల మధ్య సఖ్యత లేక నియామకానికి ఆలస్యం
- ఉన్నతస్థాయిలో ఎవరి ప్రయత్నాల్లో వారు నిమగ్నం
- దేవేందర్‌రావుకే అవకాశాలంటున్న పార్టీ శ్రేణులు
- దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం



నమిండ్ల శ్రీనివాస్ ఎర్రబెల్లి స్వర్ణ

సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీని ఏకతాటిపై నడిపించే నాయకుడు కరువయ్యాడు. నియోజకవర్గాల్లో నేతలు ఉన్నా.. జిల్లా కాంగ్రెస్‌కు రథసారథి లేకపోవడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పార్టీ కార్యక్రమాలు నిర్వహించే క్రమంలో స్తబ్దత నెలకొంది. దీంతో నాయకులు, కార్యకర్తలు కొంత ఇబ్బందిపడుతున్నట్లు తెలుస్తోంది. వరంగల్ తూర్పు, నర్సంపేట పూర్తి నియోజకవర్గాలతోపాటు వర్ధన్నపేట, పరకాల, పాలకుర్తి నియోజకవర్గాల్లోని ఐదు మండలాల్లో గల నేతలను ఒకేతాటిపై నడిపించే నాయకుడు హస్తం పార్టీలో కరువయ్యాడు. ఓవైపు వరంగల్ జిల్లాను ఆనుకొని ఉన్న హనుమకొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నీ తానై వ్యవహరిస్తుంటే.. వరంగల్ జిల్లాలో మాత్రం నైరాశ్యం నెలకొంది. ఫిబ్రవరి నెలలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించిన సమయంలో ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. అయితే అది నిలుపుకునే పరిస్థితి కనిపించడం లేదన్న వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో వినిపిస్తున్నాయి. కొద్ది నెలల క్రితం వరకు వరంగల్, హనుమకొండ జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న నాయిని రాజేందర్‌రెడ్డిని ఆ తర్వాత హనుమకొండ జిల్లా వరకు పరిమితం చేశారు. వరంగల్ జిల్లా అధ్యక్ష పదవి విషయంలో జిల్లాలోని ముఖ్య నేతల మధ్య భేదాభిప్రాయాలతో ఇంకా ఎవరినీ నియమించలేదన్న టాక్ ఉంది. ఏదేమైనా ముఖ్య నేతల మధ్య సఖ్యత కుదిర్చి డీసీసీ అధ్యక్షుడిని నియమిస్తే అన్ని నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులను ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంది.

నలుగురిలో ఆయనకే అవకాశం ఎక్కువ..

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్‌లు జిల్లా అధ్యక్ష పదవికి పోటీపడుతున్నారు. అయితే ఇద్దరూ హనుమకొండ జిల్లా ఓటర్లు కావడంతో అధ్యక్ష పదవి ఇచ్చేందుకు అధిష్టానం ఆలోచనలో పడింది. ముఖ్యుల నుంచి ఒత్తిళ్లు తీసుకొస్తున్నా వీరి విషయంలో కాస్త ఆచితూచి అడుగులు వేస్తోంది. దీంతోపాటు కొండా మురళి అనుచరుడైన నల్గొండ రమేశ్‌కు డీసీసీ పదవి ఇవ్వాలని ఆయన పట్టుబడుతున్నట్లు తెలిసింది. అలాగే 32 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ.. వివిధ హోదాల్లో పనిచేస్తున్న ప్రస్తుత కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపల్లి దేవేందర్‌రావుకే అధ్యక్ష పగ్గాలిచ్చే అవకాశాలున్నాయని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. దొంతి మాధవరెడ్డి ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామానికి చెందిన దేవేందర్‌రావుకు పార్టీ పగ్గాలు అప్పగిస్తే బాగుంటుందన్న టాక్ ఉంది. ఏనుమాముల మాజీ డైరెక్టర్‌గా పనిచేసిన దేవేందర్‌రావుకు డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలనే అంశాన్ని నేతలు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఇప్పటికే ఓ స్పష్టతకు వచ్చిన అధిష్టానం కొద్ది రోజుల్లోనే మిగిలిన ఆరు జిల్లాల అధ్యక్షులతో వరంగల్‌కు పేరు ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి.

వాహనాలకు ఎండదెబ్బ!

- సూర్యప్రతాపానికి అనతికాలంలో పాడవుతున్న వాహనాలు
- కళతప్పుతున్న షైనం
- బైక్.. కార్ల నిర్వహణ కీలకం
- ఎండలో పార్కు చేయొద్దు
- వేసవిలో పొంచి ఉన్న ప్రమాదాలు
- జాగ్రత్తలు తప్పనిసరంటున్న నిపుణులు



కాజీపేట / ఖిలా వరంగల్: వేసవి వచ్చేసింది.. ఎండలు మండిపోతున్నాయి.. జాగ్రత్తలు తీసుకోకపోతే మనుషులకే కాదు.. వాహనాలకూ ప్రమాదమే. నీరు సలసల కాగేంత ఉష్ణోగ్రతలో (45 డిగ్రీల సెంటిగ్రేడ్) ఉండే వాహన ఇంజిన్లు వేసవిలో సరైన నిర్వహణ లేకుంటే పాడైపోతాయి. వరంగల్ నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా ఎండలు 35 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఉదయం 10గంటల లోపు, సాయంత్రం 4గంటలు దాటిన తర్వాత ప్రయాణం చేయటం ఉత్తమం.

కళా విహీనంగా తయారవుతాయి..

ఈ ఏడాది వేసవి ఆరంభం నుంచే ఎండలు మండిపోతున్నాయి. ఎండలబారిన పడకుండా మనం జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే మనం వాడే వాహనాలను కూడా జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఉంది. గంటల తరబడి వాహనాలకు ఎండ తగిలితే రంగు వెలసిపోయి కళావిహీనంగా తయారవుతాయి. నగరంలో రోజురోజుకు పచ్చదనం తగ్గిపోతోంది. ఈ సమయంలో వాహనాలను నీడలో ఉంచాలంటే కష్టమైన పరిస్థితి. వాణిజ్య సముదాయాలు ఉన్నచోట సెల్లార్లలో వాహనాలను పార్కింగ్ చేయవచ్చు. నిబంధనల ప్రకారం వాణిజ్య సముదాయ యజమానులే వాహనాల పార్కింగ్‌ను ఏర్పాటు చేయాలి. అద్దె ఇళ్లల్లో ఉంటున్న వారు తమ వాహనాలను నిలిపేందుకు స్థలం ఉండడం లేదు. దీంతో ఇంటి ఎదుటే ఆరుబయట ఉంచుతున్నారు.

అనర్థాలు అనేకం

బైక్‌లు, కార్లను ఎండలో నిలపడం వల్ల సూర్యకిరణాలు నేరుగా వాహనాలపై పడి అనతి కాలంలోనే రంగు వెలసిపోయి, పాత వాహనాలుగా మారుతున్నాయి. పార్కింగ్ చేసే చోట చెట్లు ఉంటే కింద నిలపాలి. ఇళ్లల్లో పార్కింగ్ సదుపాయం లేనివారు వాహనాలను ఇంటి ముందు నిలపాల్సి వస్తే తప్పనిసరిగా వాహనాలపై టార్పలిన్లు కప్పాలి. వాహనాలను నీడలో కాకుండా ఎండలో నిలపడం వల్ల పెట్రోల్ ట్యాంకు త్వరితంగా వేడెక్కి ఇంధనం ఆవిరయ్యే అవకాశం ఉంది. దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే సాయంత్రం వేళలో బయలుదేరి వెళ్లడం ఉత్తమం. వేసవిలో వాహనాలకు పెట్రోల్, డీజిల్ పోయించే వేళల్లోను చోదకులు మార్పుచేయాలి. వాహనాలకు ఇంధనం ఉదయం 8గంటలకన్నా ముందు సాయంత్రం 6గంటల తర్వాత పోయించడం మంచిది. రాత్రి సమయాల్లో ఇందనం నింపితే ఆవిరి శాతం తగ్గుతుంది.

రేడియేటర్, ఏసీల్లో సమస్యలు

వేసవిలో తారురోడ్డు బాగా వేడెక్కుతుంది. ఈరోడ్డుపై వాహనాలను నిలిపితే టైర్లు దెబ్బతినే అవకాశముంది. ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటితే కార్ల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. లేదంటే రేడియేటర్, ఏసీల్లో సమస్యలు తలెత్తుతాయి. అలాగే గ్యాస్ సిలిండర్లను ఉపయోగించే కార్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలి. గ్యాస్‌ట్యాంకుపై మందంగా ఉన్న వస్త్రం లేదా గోనె సంచి కప్పి ఉంచడం మంచిది. గ్యాస్ లీక్ కాకుండా చూసుకోవాలి. రెండు రోజులకు ఒకసారి రేడియేటర్ కూలెంట్ లెవల్ సరిచూసుకోవాలి. ఎండలో ఎక్కువ సమయం వాహనాలు నిలపడం వల్ల రేడియేటర్ హెడ్ గ్యాస్‌కట్ అయ్యే అవకాశం ఉంది. ట్రాఫిక్ జామ్ అయినప్పుడు సిగ్నల్స్‌లలో కార్లలో ఏసీ వేయవద్దు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు వారి వారి వాహనాలకు విశ్రాంతి ఇవ్వాలి.

తరచూ పరిశీలించాలి



ఎండ వేడిమికి వాహనాల టైర్లు పగిలి ప్రమాదం జరిగే అవకాశముంది. ఎండలో వాహనాలు నిలపడం వల్ల రంగు వెలసిపోవడంతో పాటు పెట్రోల్ ట్యాంకు, గ్యాస్‌ట్యాంకు లీకవుతాయి. వాటి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలి. సాధ్యమైనంత వరకు వాహనాలను నీడలో నిలపాలి.

\- యాదగిరి, మెకానిక్, మడికొండ

వర్గీకరణ చేయకుంటే గుణపాఠం తప్పదు

ధర్మసాగర్ : తక్షణమే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించకుంటే రానున్న ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీకి గుణపాఠం తప్పదని ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ గంగారపు శ్రీనివాస్ హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశానికి గంగారపు శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించి చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడచినా బీజేపీ పెద్దలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి సరైన మెజార్టీ ఉన్నా వర్గీకరణ బిల్లుకు ఎందుకు చట్టబద్ధత కల్పించడం లేదని ప్రశ్నించారు. ఇకనైనా వెంటనే పార్లమెంటులో వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశాడు. లేకుంటే రానున్న ఎన్నికల్లో మాదిగ, ఉపకులాల ప్రజలు బీజేపీకి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.